క్లుప్తంగా

అండర్ పాస్ బ్రిడ్జీల్లో వర్షపు నీరు



నెలబల్లి గ్రామ సమీపంలో బ్రిడ్జీ వద్ద నిలిచిన వర్షపు నీరు

దొరవారిసత్రం : మండలంలోని నెలబల్లి, అక్కర పాక తదితర గ్రామాల్లో రైలు పట్టాలు దాటే ప్రాంతాల్లో ఉన్న అండర్ పాస్ బ్రిడ్జీల్లో భారీగా వర్షపు నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది లు పడుతున్నారు. బ్రిడ్జీల్లో వర్షపు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు తొలిగించేందుకు మోటా ర్లు ఏర్పాటు చేశారు. వాటిని పనిచేయించి నీటి ని బయటికి పంపించడంలో సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించివర్షపు నీటిని తొలగించాలని కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి ప్రవీణ

ఓజిలి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్తివరం వైద్యాధికారిణి ప్రవీణ తెలిపారు. మండలంలోని కొత్తచెరువులో సోమవారం 104 సిబ్బందితో కలిసి వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ వర్షాలకు కొబ్బరిచిప్పలు, టైర్లు, ఖాళీ బిందెల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అనంతరం మురుగు కాలువలను శుభ్రం చేసి కిరోసిన్ చల్లాలని సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సట్టు మహేందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది రాజగోపాల్, ఝాన్సీ, రమణి, గీత, వేణుగోపాల్, మెహతాబ్, పద్మజ పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై జాగ్రత్తలు అవసరం



గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓజిలి: గ్యాస్‌ను వినియోగించే సమయంలో జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగకుండా నియంత్రించవచ్చని ఆర్‌ఆర్ హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకులు ముమ్మడి సుబ్బారావు తెలిపారు. ఆయన సోమవారం తమ సిబ్బందితో కలిసి ఓజిలి సచివాలయం వద్ద గ్యాస్ వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గ్యాస్‌పైపు, లైటర్లు, రెగ్యులేటర్లను తరచూ మార్చుకోవాలని సూచించారు. గ్యాస్ లీకైనప్పుడు లైట్లు వేయరాదని తెలిపారు. అనంతరం గ్యాస్ పైపు, రెగ్యులేటర్, స్టాండ్లు అందజేశారు.

చిన్నపాటి వర్షానికే వీధులు బురదమయం



బురదమయంగా మారిన వెంకటరెడ్డిపాళెం దళితవాడలోని వీధి

వాకాడు : మండలం వెంకటరెడ్డిపాళెం దళితవాడలో చిన్నపాటి వర్షానికే వీధులు రొచ్చు రొచ్చుగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అల్పపీడన ద్రోణి కారణంగా మూడు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. వెంకటరెడ్డిపాళెం దళితవాడలో వర్షపు నీరు వీధుల్లో నిలిచి బురదమయం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపండి

దొరవారిసత్రం : సూళ్లూరుపేట నియోజకవర్గంలో అవసరమైన పనులకు ప్రతిపాదనలు పంపిస్తే మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే విజయశ్రీ తెలిపా రు. ఆమె సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అంతకు ముందు టీడీపీ బీసీ నాయకులు మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యంతో కలిసి కెనరా బ్యాంకు నుంచి మండల కార్యాలయాల వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఒక వర్గం (అగ్ర వర్ణాలు), పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జకరయ్య, మండల నేతలు పాల్గొనలేదు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

సైదాపురం: తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సైదాపురంలోని ఎంఎస్‌కాలనీకి చెందిన పలువురు గిరిజనులు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శారద, ఎంపీటీసీ పద్మ పాల్గొన్నారు.

కలిచేడు భూముల సమస్య తీరేదెన్నడో?

వారంతా పేద రైతులు. వారు గ్రామంలో ఉన్న వెంకటగిరి రాజాల ఇనాం భూములను 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. అనుభవమే కాని హక్కుల పత్రాలు లేవు. పట్టాలు ఇవ్వాలని పోరాటం చేస్తున్నా ఫలితం లేదు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా వారి తలరాతలు మారడం లేదు.

– సైదాపురం

అనుభవమే కానీ పట్టాలు లేవు

- 50 ఏళ్లుగా పట్టాల కోసం పోరాడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు
- పట్టాలు లేకపోవడంతో అందని రుణాలు



కలిచేడులో రైతులు సాగు చేసుకుంటున్న ఇనాం భూములు

సైదాపురం మండలంలోని కలిచేడు గ్రామంలో సుమారు 1800 ఎకరాల ఇనాం భూములున్నాయి. రాజాలు పాలించే సమయంలో ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అదే గ్రామానికి చెందిన సుమారు 800 మంది రైతులు 50 ఏళ్ల నుంచి ఆ భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్నారు. వారికి పట్టాలు ఇవ్వలేదు. రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ ఇనాం భూములుగానే చూపిస్తున్నారు. అడంగల్‌లో మాత్రం సాగు చేసే రైతుల పేర్లున్నాయి. పట్టాలు మంజూరు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని గ్రామస్తులు పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదు. గతంలో జాయింట్ కలెక్టర్ చొరవచూపి భూములను సమగ్రంగా సర్వే చేసి సాగు చేసుకుంటున్న వారికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన బదిలీ కావడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. మూడేళ్ల క్రితం రైతుల నుంచి కొంత నగదు వసూలు చేసి హడావుడిగా సర్వే చేపట్టారు. తర్వాత ఏమైందో కాని పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చే విషయం పెండింగ్‌లో పడిపోయింది. రైతులు తమకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలంటూ రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. పాసుపుస్తకాలు లేకపోవడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. వడ్డీ వ్యాపారులు కూడా అప్పులు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నారు.

చిల్లిగవ్వ కూడా అప్పు ఇవ్వడం లేదు



గ్రామంలో ఉన్న పొలాలకు పాసుపుస్తకాలు లేకపోవడంతో ఏ బ్యాంకూ చిల్లి గవ్వ కూడా రుణం ఇవ్వడం లేదు. పంటల సాగుకు పెట్టుబడి అందక ఇబ్బందులు పడుతున్నాం. రెవెన్యూ రికార్డుల్లో అనుభవదారులుగానే మిగిలిపోతున్నాం. పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండాపోతోంది. **- బాబు, కలిచేడు**

సమస్యను వెంటనే పరిష్కరించాలి



కలిచేడు గ్రామంలో ఉన్న ఇనాం భూములను సాగు చేసుకుంటున్న సుమారు 800 మంది రైతులకు న్యాయం చేయాలి. 50 ఏళ్లుగా ఈ సమస్య అలానే ఉంది. ఎంతోమంది అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాలేదు. పట్టాదారు పుస్తకాలు లేకపోవడంతో సాగుకు పెట్టుబడి సాయం అందడం లేదు. సమస్యను వెంటనే పరిష్కరించాలి. **- మునిరత్నం, కలిచేడు**

ఈ విషయం నా దృష్టికి రాలేదు



సైదాపురం మండలంలోని కలిచేడు ఇనాం భూముల విషయం ఇంత వరకు నా దృష్టికి రాలేదు. నేను ఎన్నికల బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా నుంచి వచ్చాను. రైతులు రాత పూర్వకంగా తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను. **- ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్, సైదాపురం**

వైఎస్సార్ సీపీ నేతకు కిలివేటి పరామర్శ



నెలవల నాగరాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నెలవల నాగరాజును సోమవారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. నాగరాజు గుండెకు సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న కిలివేటి భీమవరం గ్రామానికి వెళ్లి నాగరాజు ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, మండల మాజీ కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



కండలేరు గురుకులంలో వంట గదిని పరిశీలిస్తున్న డాక్టర్ రాజకుమారి



రాపూరు హాస్టల్ విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ సుదర్శనమ్మ

రాపూరు: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వేపినాపి, రాపూరు పీహెచ్‌సీల వైద్యులు రాజకుమారి, సుదర్శనమ్మ తెలిపారు. వారు సోమవారం కండలేరు గురుకుల పాఠశాల, మండలంలోని వసతి గృహాలను పరిశీలించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం వల్ల డయేరియా వస్తుందన్నారు. దోమ కాటు వల్ల డెంగి, మలేరియా, చికున్‌గునియా జ్వరాలు ప్రబలుతాయని వివరించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది నజీమున్నీసా, హసీనా, లింగమూర్తి, వెంకటేశ్వరావు, శిరీష పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపుపై గ్రామస్తుల నిరసన



నిరసన తెలుపుతున్న జరుగుమల్లి గ్రామస్తులు

కోట : ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌ను టీడీపీ నాయకులు తొలగించడంపై కోట మండలం జరుగుమల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ నాగరాజారావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటక్రిష్ణయ్య ఎన్నో ఏళ్లుగా అందరికీ సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డ్ కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రణాళికాబద్ధంగా పని కల్పిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. రాజకీయ కారణాలతో టీడీపీ నాయకులు అతన్ని తప్పించి మరో వ్యక్తిని తీసుకునేందుకు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని వెల్లడించారు. అధికారులు స్పందించి వెంకటక్రిష్ణయ్యనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు రూరల్ : అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న మండల సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గూడూరు మండలంలో పనిచేస్తున్న రెవెన్యూ సర్వేయర్ గూడూరు రెండోట్టణంలోని 520–ఏ–1బీలో సబ్ డివిజన్‌లో అవకతవకలకు పాల్పడడంతో పక్క పక్కనే నివాసం ఉండే వారి మధ్య గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే ఎప్పుడో చేసిన సర్వే గురించి ఇప్పుడు మాట్లాడితే ఎలా అని ఎదురు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన నివేదికలపై విచారించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, రైతు సంఘం నాయకులు సీవీఆర్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు చంద్రయ్య, కే నారాయణ, చల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పట్టాలు ఇప్పించాలని గిరిజనుల నిరసన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఓజిలి: తాము సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, సాగు చేసుకునేందుకు భూమి ఇవ్వాలని కుందాం గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మండలంలోని కుందాం గ్రామంలో సర్వే నంబర్ 1–1లో 1,266 ఎకరాల మేత పొరంబోకు భూములు ఉన్నాయి. వాటిలో కొంత భూమిని భూస్వాములు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. అదేవిధంగా కుందాం గ్రామానికి చెందిన కొంతమంది గిరిజనులు కూడా కొన్ని ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటున్నారు. మరికొందరు జీవనాధారం లేక భూమిని సాగు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిని అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో గిరిజనులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. తమకు జీవనాధారం లేకపోవడంతో మేత పొరంబోకు భూముల్లోని చెట్టుపుట్టలను తొలగించి సాగు చేసుకునేందుకు సిద్ధం చేసుకుంటుండగా అటవీశాఖ, రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని వాపోయారు. భూస్వాములు సాగుచేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమ సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని, భూమి లేని వారికి భూములు ఇవ్వాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ముకుంద తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు

సూళ్లూరుపేట : ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా సోమవారం సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బీ శంకర శర్మ అధ్యక్షతన ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న విద్యా విధానంలో విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేసి నైపుణ్యంపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. చదువుకుంటూనే నైపుణ్యాభివృద్ధి సంస్థలో శిక్షణ తీసుకుంటే ఉద్యోగ ఉపాధి పొందే అవకాశాలు మెండుగా వుంటాయన్నారు. స్కిల్ ఇండియా -2024 పాల్గొన్న బీఎస్సీ విద్యార్థిని హనీడ్రెస్ ప్రతిభ చూపి ఉద్యోగానికి ఎంపికైన సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జేకేసీ ఇన్‌చార్జి డాక్టర్ జీకే ప్రసాద్, అధ్యాపకులు డి ఉషారాణి పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

వెంకటగిరి రూరల్ : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని బంగారుపేట పీహెచ్‌సీ వైద్యులు శివకుమార్ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం స్మార్ట్ లివింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ఉచితమంటూ ఇంత బాదుడా



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

గూడూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితమని చెబుతూ గతంలో కన్నా రూ.1000 ఎక్కువగా వసూలు చేస్తూ పేదలపై భారం మోపుతోందని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. వారు సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో దొరికే ఇసుకను వెంకటగిరి, సూళ్లూరుపేట ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన స్టాక్ పాయింట్లకు తరలించి అక్కడ ఉచితమని అధిక ధరలకు విక్రయిస్తున్నారని దుయ్యబట్టారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఇసుక దొరుకుతుంటే పేదలపై కొంత భారం తగ్గి ఇల్లు కట్టుకుంటారని తెలిపారు. గతంలో రూ.4,500లకు గూడూరులో ఇసుక దొరికితే నేడు రూ.5,500లకు తెచ్చుకోవాల్సి వస్తోందని విమర్శించారు. ఇలా చేయడం వల్ల భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇంత భారం మోపితే పేదలు ఇళ్లు ఎలా నిర్మించుకుంటారని ప్రశ్నించారు. అనంతరం కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పుట్టా శంకరయ్య, జోగి శివకుమార్, అడపాల ప్రసాద్, సురేష్, శ్రీనివాసులు, సయ్యద్ రఫీ, మధు తదితరులు పాల్గొన్నారు

ప్రతి పనినీ క్షుణ్ణంగా పరిశీలించండి



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ రవి

చిల్లకూరు : ఉపాధి హామీ కింద గ్రామాల్లో చేసిన పనులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ రవి డీఆర్పీలకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో భానుమూర్తి అధ్యక్షతన సోమవారం సోషల్ ఆడిట్ బృందాల సభ్యులు, ఉపాధి క్షేత్ర సహాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి ఆడిట్ బృందాల సభ్యులు ఎంపిక చేసిన గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. వారికి అందించిన పనుల వివరాలను బట్టి ఆయా పనులు చేసిన ప్రాంతాలను చూపించే బాధ్యత క్షేత్ర సహాయకులదేనన్నారు. అక్కడ పనులకు వచ్చిన కూలీలను విచారించే సమయంలో క్షేత్ర సహాయకులు దగ్గర ఉండరాదన్నారు. ప్రతి ఒక్కరూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల వివరాలను పూర్తిగా నమోదు చేసి ప్రజా వేదికలోగా అందజేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఉపాధి ఏపీవో గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వెంకటగిరి రూరల్ : ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. ఆయన సోమవారం 14వ వార్డు పరిధిలో ఉన్న సచివాలయంలో సిబ్బందితో కలిసి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యను పరిష్కస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఎన్‌బీకేఆర్‌లో ఘనంగా జ్యోతి డే



నేదురుమల్లి బాలక్రిష్ణారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ అధ్యాపకులు, సిబ్బంది

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సోమవారం 89వ జ్యోతి డేను ఘనంగా నిర్వహించారు. దివంగత నేదురుమల్లి బాలక్రిష్ణారెడ్డి విద్యాసంస్థలను ప్రారంభించిన రోజును జ్యోతి డేగా ప్రతి ఏటా జరుపుకుంటారు. ఇందులో భాగంగా అధ్యాపకులు, సిబ్బంది కళాశాలలోని బాలక్రిష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పూరిగుడిసెలో రాత్రి పూట బడితో ప్రారంభమైన విద్యాసంస్థ అంచెలంచెలుగా ఎదిగినట్టు తెలిపారు. వేలాది మందికి ఉచితంగా విద్యను అందించిన ఘనత పద్మశ్రీ నేదురుమల్లి బాలక్రిష్ణారెడ్డికి దక్కుతుందన్నారు. నేడు కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విద్యాసంస్థలను విజయపథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు రవీంద్రారెడ్డి, రాజశేఖరరెడ్డి, హరనాథ్‌రెడ్డి, కిషంధర్ పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న స్ఫూర్తి సేవా సంస్థ ప్రతినిధులు

ఓజిలి: విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, అనుసూయ తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆర్మేనిపాడు, చిలమానుచేను ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం స్ఫూర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వాహకులు డి.దామోదర్‌రాజు, కొండూరు దామోదర్‌రాజు సోమవారం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.4 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.3 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పారిచర్ల సాయిరాం, గున్నం సేవా ట్రస్ట్ నిర్వాహకులు రవీంద్రరెడ్డి, ఉప సర్పంచ్ సుకుమార్‌రాజు, కొండూరు వెంకటసబ్బరాజు, మధురాజు, వెంకటరమణరాజు, పరంధామరాజు, వెంకటేష్‌రాజు, నారాయణరాజు, బాలకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి చందనాలంకరణ



గరుడ వాహనంపై ఊరేగుతున్న నృసింహుడు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామికి సోమవారం చందనాలంకరణను ఘనంగా చేపట్టారు. స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా సోమవారం మూల మూర్తికి చందనంతో అలంకరించడం ఆచారం. ఈ క్రమంలో స్వామికి ఉదయం అభిషేకాలు చేశారు. అనంతరం చందనంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం చేశారు. 11 గంటలకు కల్యాణం చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం చేశారు. రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై కొలువుదీరి ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం మస్తానమ్మ

సైదాపురం: ప్రతి విద్యార్థీ కష్టపడి చదువుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని చాగణం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్ మస్తానమ్మ తెలిపారు. చాగణం ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతిలో ప్రతిభ చూపిన కె.ప్రశవి, వై.చెంచుప్రియ, కె.మోక్షగ్నసాయిని ఘనంగా సన్మానించారు. అనంతరం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అదేవిధంగా ఇంగ్లీషులో అత్యధిక మార్కులను సాధించిన ఎ.తేజశ్వని, రజని, చెంచుప్రియ, అజయ్‌ను కూడా సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బొల్లిగర్ల వెంకటేశ్వర్లు, ప్రభాకర్, రాధాకుమారి, కుమార్, కుమార్ రాజా, వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.